క్లుప్తంగా

చిరుధాన్యాలపై అవగాహన



వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషక పక్షోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీనివాసరావు చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ విషయంపై గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను చైతన్య పరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం పోషక విలువలతో కూడుకుని ఉంటుందని, వాటిని లబ్ధిదారులు వినియోగించుకునేలా చూడాలని ఆయన కోరారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన

పాన్‌గల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతున్నట్లు తహసీల్దార్ సుభాష్‌నాయుడు గురువారం తెలిపారు. మండలంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన మొత్తం 357 ధరణి దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 127 దరఖాస్తులను పరిశీలించినట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తులను గ్రామాల వారీగా క్షుణ్ణంగా పరిశీలన చేసి వాటిని పరిష్కరిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో డీటీ అశోక్‌నాయుడు, ఆర్‌ఐలు తిరుపతయ్య, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలకు వస్తేనే బహుళ నైపుణ్యాలు

వనపర్తి టౌన్: విద్యార్థులు ప్రతి రోజూ కళాశాలకు హాజరవడం ద్వారా బహుళ నైపుణ్యాలు పెంపొందడానికి అవకాశం ఉంటుందని ఏబీవీపీ పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ తేజ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎంఆర్ డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ రాష్ట్ర పిలుపు మేరకు ఏర్పాటు చేసిన పరిసర్ చలో అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఎక్కువ సమయాన్ని కళాశాల తరగతి గదిలోనే గడపాలని, తద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, జిల్లా కన్వీనర్ జగదీశ్, జిల్లా ఖేల్ కన్వీనర్ కేదర్‌నాథ్, నాయకులు కార్తీక్, నితిన్, నవీన్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

పెబ్బేరు రూరల్: వనపర్తి నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి కోరారు. పెండింగ్‌లో ఉన్న రెండు 33 కేవీ ఉప కేంద్రాలకు నిధులు మంజూరు చేయాలని, వనపర్తి పట్టణంలో డివిజన్ 1, 2 ఏర్పాటు చేయాలని, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ఆత్మకూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వికాస్ కళాశాలలోని రెండు సెంటర్లలో గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చివరి పరీక్షకు 468 మంది విద్యార్థులకు గాను 443 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎగ్జామినేషన్ సూపర్‌వైజర్లు భాగ్యవర్ధన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తెలిపారు.

పాన్‌గల్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 29న ప్రారంభమై గురువారం ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేష్, డీఓ రాములు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 62 మంది విద్యార్థులకు 62 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు పేర్కొన్నారు.

'పది' విద్యార్థులకు వీడ్కోలు

ఆత్మకూర్: మండలంలోని జూరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా తొమ్మిదవ తరగతి విద్యార్థుల ఆట, పాటలు అలరించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం హిందీ బోధకులు అబ్దుల్‌అలీం, తాహేరబేగం, డిప్యూటేషన్‌పై వెళ్లిన భానుప్రియలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం రాఘవేందర్, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, షకీల్ అహ్మద్, నాగప్రియ, రోజ, నరేష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తీర్చాలి

చిన్నంబావి: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న తాగునీటి ఎద్దడిని గుర్తించి ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రమణరావు అన్నారు. ఆయన గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సమస్యపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని గడ్డబస్వాపురం, గూడెం, వెల్టూరు, పెద్దమారు, చెల్లపాడు, వెంకటంపల్లి, కాలురు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందని పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ దృష్టికి తీసుకొచ్చారు.

ప్రమాదాల నివారణకు చర్యలేవీ?



జిల్లా సరిహద్దు బుద్దారం గండి వద్ద సూచికబోర్డులు లేకుండా ప్రమాదకరంగా మలుపు (ఫైల్)

- అతివేగంతో గాల్లో కలుస్తున్న ప్రాణాలు
- సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై ఆందోళన

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో బీటీ రోడ్లు వేయడం పూర్తి కావడంతో వాహనాల వేగం పెరిగింది. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్నేళ్లుగా రోడ్లు సరిగా లేక వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పూర్తయిన తర్వాత వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో వాహనదారులు ప్రాణాలు కోల్పోవడంతో పాటు క్షతగాత్రులుగా మారుతున్నారు. కూడళ్ల వద్ద స్పీడు బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోకుంటే మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలని వాహనదారుల కోరుతున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి మండలంలో గతేడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఆర్‌అండ్‌బీ, పీఆర్ పరిధిలో కొత్త రోడ్లు ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని రోడ్లు రెన్యూవల్ చేశారు. రేవల్లి నుంచి గోపాల్‌పేట వరకు 19 కిలోమీటర్ల రోడ్డు పూర్తయింది. గోపాల్‌పేట నుంచి చెన్నూరు వరకు ఉన్న బీటీ రోడ్డు రెన్యూవల్ చేశారు. చాకల్‌పల్లి సమీపంలో నుంచి కేశంపేట పాతతండా వరకు బీటీ వేశారు. కానీ రోడ్ల ములుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు వేగంగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు.

మృత్యు ఘంటికలు

గతేడాది నవంబర్ 27 రోజు రాత్రి వనపర్తి నుంచి బుద్దారం వైపు ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వెళ్తుండగా ఓ కంటెయినర్ వాహనం ఢీకొట్టడంతో శ్రీహరి అనే యువకుడు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. అదే ప్రమాదంలో మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. బుద్దారం గ్రామానికే చెందిన ఏఆర్ కానిస్టేబుల్ శివకుమార్ డిసెంబర్ 28 న రాత్రి సమయంలో బుద్దారం నుంచి వనపర్తి వెళ్తుండగా బుద్దారం శివారులో మలుపు వద్ద బైకు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కరెంటు పోల్‌కు ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. ఏదుట్ల, గోపాల్‌పేట మధ్యలో ఇద్దరు మరణించారు. చీర్కపల్లి సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైకుపై అతివేగంతో వెళుతూ కిందపడి మరణించారు. ఇలా గతేడాది నుంచి సుమారు ఎనిమిది మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఇరవై మందికి పైగా గాయాలపాలయ్యారు.

చర్యలు తీసుకోవాలి



గోపాల్‌పేట నుంచి ఏదుల, రేవల్లి వరకు బీటీ రోడ్డు పూర్తయింది. దీంతో వాహనాల వేగం పెరిగి రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వేరు ఘటనల్లో ఈ రోడ్డులో ముగ్గురు చనిపోవడంతో పాటు చాలామంది గాయాలపాలయ్యారు. ప్రమాదాలు నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సంగనమోని వెంకటస్వామి, గోపాల్‌పేట

పనులు పూర్తి చేస్తాం

వనపర్తి డిగ్రీ కాలేజీ నుంచి బుద్దారం గండి సమీపంలో ఉన్న జిల్లా సరిహద్దు వరకు సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఇతర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి రూ.30 లక్షలు మంజూరయ్యాయి. ఎలక్షన్ కోడ్ అమల్లోకి వచ్చినందున పనులు ఆగాయి. వాటికి సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయి. తొందర్లోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

– దేస్యానాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ, వనపర్తి

'ఉపాధి' కూలీలకు నీడ



పాన్‌గల్‌లో ఉపాధి కూలీలకు నీడ కోసం ఏర్పాటు చేసిన నెట్



చింతకుంటలో..

పాన్‌గల్: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితం అయిన 'పని ప్రదేశంలో నీడ ఏది' కథనానికి అధికారులు స్పందించారు. మండలంలో ఉపాధి హామీ పనులు జరుగుతున్న గ్రామాల్లో గురువారం కూలీలకు నీడ, నీటి వసతి కల్పించారు. తమ ఇబ్బందులను గమనించి అధికారులకు తెలిసే విధంగా కథనం ప్రచురించి, వసతులు కల్పించే విధంగా చేసిన 'సాక్షి' దినపత్రికకు ఉపాధి కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

'డబుల్' ఇళ్లల్లో వసతులు కల్పించాలి



ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మదనాపురం: మండల కేంద్రంలో ఇటీవల లబ్ధిదారులకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద కనీస వసతుల ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు అన్నారు. గురువారం వారు ఇళ్లను పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా దేవరకద్ర నియోజవర్గంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని ధ్వజమెత్తారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు బాత్‌రూం నీరు వెళ్లే కనెక్షన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తాగునీటికి అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. మదనాపురం గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంక్ తుప్పుపట్టిపోయిందని, గ్రామ పంచాయతీలో నిధులు లేవని చెప్పడంపై అసహనం వ్యక్తం చేశారు. సత్వరమే అధికారులు స్పందించి ఇళ్లలో వసతులు ఏర్పాటు చేయాలనినీ కోరారు. కార్యక్రమంలో చెన్నయ్య, వెంకటేశ్, చిరంజీవి, మొగిలి, సత్యనారాయణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రైతు హామీలు నెరవేర్చాలని నిరసన



వీపనగండ్లలో నిరసన తెలియజేస్తున్న రైతు సంఘం నాయకులు

వీపనగండ్ల: దేశవ్యాప్తంగా రైతులు చేపట్టిన ఉద్యమ సమయంలో కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని, అందుకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రైతులకు నష్టం చేకూర్చే నల్లచట్టాలను రద్దు చేసి, రైతు రుణమాఫీ, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరణ, రైతులకు రూ.10వేల పింఛన్, ప్రభుత్వ రంగాల సంస్థలను ప్రైవేటీకరించడం నిలిపివేయాలని, కార్మికుల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరగా.. అందుకు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం నేటికీ వాటిని అమలు పరచలేదని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, ఈశ్వర్, వెంకటస్వామి, వీరబాబు, గోపి, కృష్ణయ్య, రాముడు, వెంకటేశ్వర్ల గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన



తిప్పాయిపల్లిలో టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పెబ్బేరు రూరల్: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి రాముడు ఆధ్వర్యంలో మండలంలోని తిప్పాయిపల్లిలో గురువారం క్షయవ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో గ్రామంలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. అందులో ముగ్గురికి టీబీ ఉన్నట్లు తేలిందన్నారు. వారు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు వాడడంతో వ్యాధి నయం అయిందని తెలిపారు. గ్రామంలో ఇప్పుడు ఒక కేసు మాత్రమే ఉండడంతో గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా ప్రభుత్వం గుర్తించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ సంగీత, మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్, డాక్టర్ వంశీకృష్ణ, బాసిద్‌ఖాన్, రత్నయ్య, పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, హెల్త్‌అసిస్టెంట్ తిరుపతయ్య, ఏఎన్‌ఎం సరోజ, ఆశాకార్యకర్తలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఇబ్బందులు రానివొద్దు

వనపర్తి టౌన్: వేసవి కాలంలో ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తగ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆర్టీసీ డీఎం వేణుగోపాల్‌కు సూచించారు. ఈ మేరకు గురువారం డీఎంతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. బస్టాండులో తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు అవసరమైన మేరకు ఉండేలా చూడాలని కోరారు. ఫ్లాట్‌ఫాం లేని చోట ప్రయాణికులకు తాత్కాలికంగా తడకలతో నీడ వసతి కల్పించాలని చెప్పారు. డిపోలో ఉన్న కొద్దిపాటి నిధులను కేటాయించి మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. వనపర్తి నుంచి పెబ్బేర్, పాన్‌గల్, పెద్దమందడి మీదుగా కొత్తకోట, బిజినేపల్లి ప్రాంతాలకు షెటిల్ బస్సులు నడిపేలా చూడాలని, ఈ మేరకు తన వంతు ప్రయత్నం చేస్తానని సూచించినట్లు చిన్నారెడ్డి తెలిపారు.

సర్వే నిర్వహించాలి

పాన్‌గల్: కుష్ఠు వ్యాధిగ్రస్తుల ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మండల ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసులు అన్నారు. గురువారం దావాజిపల్లిలో ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేలో శరీరంపై దురద, మంట, తెల్ల సిబ్బెం వంటి లక్షణాలు ఉంటే జిల్లా ఆస్పత్రిలో చర్మ వ్యాధి నిపుణులను సంప్రదించాలని సూచించారు.

పార్టీ కార్యకర్త అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే



అప్పరాలలో పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్సింహాగౌడ్(42) ప్రయాణిస్తున్న బైక్ బుధవారం మండలం రాయిణిపేట స్టేజీ ఎన్‌హెచ్44పై అదుపుతప్పి బస్‌షెల్టర్ పిల్లర్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అప్పరాలకు చేరుకుని నర్సింహ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నర్సింహగౌడ్ పాడె మోసిన ఎమ్మెల్యే అంత్యక్రియలో పాల్గొన్నారు. నర్సింహా మృతి పార్టీకి తీరని లోటని, వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, అయ్యగారి విష్ణువర్ధన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, గాడీల ప్రశాంత్, శంకర్‌నాయుడు, అజ్జకొల్లు నర్సింహాగౌడ్, తదితరులు ఉన్నారు.

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు నాగరాజ్ తల్లి అనంతమ్మ గురువారం మృతి చెందడంతో స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, కురుమూర్తి, భగవంత్ రెడ్డి, రాఘవచారి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్య నాయకులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి 16 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడం, అందులో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఉండటంతో కొత్తకోట ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు మాట్లాడుతూ ఆర్య వైశ్యుల్లో చాలా కుటుంబాలు నిరుపేదలుగా ఉండి, దుర్భర జీవితాలు గడుపుతూ కుటుంబ పోషణ కష్టంగా సాగుతోందని వాపోయారు. సరళీకృత విధానంతో పెద్ద, చిన్న పట్టణాల్లో సైతం వాణిజ్య సముదాయాలు ఏర్పాటు కావడంతో తమ వ్యాపారాలు సాగడం లేదన్నారు. దీంతో ఆర్యవైశ్యులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగలేకపోతున్నారని తెలిపారు. ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో విశ్వనాథం వెంకటరమణ, బాదం వెంకటేశ్వర్లు, నర్సింహశెట్టి, బాదం విజయ్‌కుమార్, బీమా కిషోర్‌కుమార్, బీమా చంద్రకాంత్, బీమా బాలకృష్ణ, గుంత సురేష్, శంకర్‌శెట్టి, రాజు, నరేష్, బాలీశ్వర్, సురేష్‌శెట్టి, కిరణ్ తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ఎజెండా



శ్రీరంగాపురంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు



గోపాల్‌పేటలో..

పెబ్బేరు రూరల్: మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తున్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ గురువారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, మండల అధ్యక్షుడు రాములుయాదవ్ మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకోకముందే మహిళల సాధికారత కోసం మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ.. వడ్డీ లేని రుణాలు, మహాలక్ష్మి రూ.2,500 పథకం అమలుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కంభాళాపురం ఎంపీటీసీ ఎల్లస్వామి, అశోక్‌రెడ్డి, విష్ణు, రామచందర్, వెంకటస్వామి, శివన్న, వెంకటయ్య, కురుమూర్తి, గంగన్న, రమేష్‌గౌడ్, బాలరాజు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రశంసిస్తూ గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు భరోసానిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, టౌన్ అధ్యక్షుడు శివన్న, ఉపాధ్యక్షుడు నాగశేషి, చంద్రశేఖర్, మేస్త్రీ బాలయ్య, వెంకటయ్య, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి



మిట్టనందిమళ్లలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



అమరచింత: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మిట్టనందిమళ్ల, చింతరెడ్డిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈమేరకు ఆయా గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జంగల్ కటింగ్‌లతో పాటు సాగునీటి కాల్వల్లో పెరిగిన జమ్మును తొలగింపు, చెరువుల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఫీల్డు అసిస్టెంట్లు పని ప్రదేశంలో ఉంటూ కూలీలకు నీడ కల్పించడమే కాకుండా నీటి వసతితో పాటు మౌలిక సదుపాయలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈసీ రఘు తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలి..

ఉపాధి హామి పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని సింగంపేటలో గురువారం ఉపాధి కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది చేసిన కూలి డబ్బులు అకౌంట్ లాక్ కావడంతో డబ్బులు రాకుండా పోయిందని వాపోయారు. పని ప్రదేశంలో టెంటు సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, నర్సింహ, ఉపేంద్ర, సావిత్రి, ఆశమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.


రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా నిబంధనల మేరకు పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలని ఏపీఓ కుర్మయ్య సిబ్బందికి సూచించారు. గురువారం మండలంలోని కేతేపల్లి, అన్నారం గ్రామాల్లో ఆయన పర్యటించి ఉపాధి పనులు, కూలీలకు కల్పించిన వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు నీడ, నీటి వసతి ఉండాలన్నారు. పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని, రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అలసత్వం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



పెబ్బేరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు



కేతేపల్లిలో..

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా భారతి, డీఈఓగా లోకేష్, ఎంఈఓగా గోవర్ధన్, హెచ్‌ఎంగా ప్రజ్ఞతేజతో పాటు 18 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం రవికుమార్, హెచ్‌ఎం శివకుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు వారి నైపుణ్యాలు ప్రదర్శించి, తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఉత్తమంగా విద్యాబోధన చేసిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఎంఈఓగా బిందు, హెచ్‌ఎం దామోదర్ వ్యవహరించారు. కార్యక్రమంలో లక్ష్మణ్, వెంకటస్వామి, కవిత, శ్యామల, నర్మద తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ప్రతి నిత్యం మధ్యాహ్న భోజనాన్ని హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పల్లా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో తప్పులుండొద్దు

వీపనగండ్ల: ఓటరు లిస్టుల తయారీలో ఎలాంటి తప్పులు దొర్లకుండా చూసుకోవాలని తహసీల్దార్ వరలక్ష్మి బీఎల్‌ఓలకు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వీఐపీలుగా గుర్తించబడిన వారి జాబితాను తయారు చేయాలని దివ్యాంగులు, డబుల్ ఓటర్ల గుర్తింపు తదితర అంశాలపై బీఎల్‌ఓలు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఆర్‌ఐ కురుమూర్తి, జూనియర్ అసిస్టెంట్ రఘు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

వనపర్తి టౌన్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఈనెల 16వ తేదీన నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే ప్రధాని మోదీ బహిరంగ సభకు ప్రజలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ప్రధాని మోదీ బహిరంగ సభ సన్నాహక సమావేశాన్ని మండల అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ, సీనియర్ నాయకుడు మెంటేపల్లి పురుషోత్తంరెడ్డి హాజరయ్యారు. అనంతరం కడుకుంట్ల గ్రామానికి చెందిన గోపులాపురం వెంకటేష్ యాదవ్ టీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరినందున వారు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పెద్దిరాజు, దేవేందర్, పోతు శ్రీనివాసులు, బాలరాజు, శ్రీనివాసులుగౌడ్, సుదర్శన్,రాజేష్, రాజేందర్, మల్లేష్, బాలరాజు, బీసిరెడ్డి ఉన్నారు.

ఖిల్లాఘనపురం: ఈ నెల 16వ తేదీన నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బీజేపి అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసులుగౌడ్, ఫిలింబోర్డు సభ్యుడు కుమారస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ కల్యాణమండపంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాంరెడ్డి, బుచ్చిబాబుగౌడు, ఆశన్న, విక్రంరెడ్డి, శివశంకర్, రవీంద్రాచారి, వెంకటరమణ, రవినాయక్, ఈదమ్మ, శాంతి ఉన్నారు.

